క్లుప్తంగా

మున్సిపల్‌కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తా



చైర్‌పర్సన్ దంపతులతో నర్సింగరావు

మెట్‌పల్లి: మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ రాణవేని సుజాత దంపతులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దంపతులు ఆయనను సన్మానించారు. అనంతరం పట్టణంలో నెలకొన్న సమస్యల గురించి వారు చర్చించారు. పట్టణాభివృద్ధికి తన వంతు సహకారమందిస్తానని నర్సింగరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, నాయకులు జెట్టి లింగం, తిప్పిరెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పటిష్టం చేయాలి

జగిత్యాల: బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం చేశారని, ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టం చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ అన్నారు. కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోనే విద్యారంగం అనేకంగా వెనుబడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, యూనివర్సిటీలకు వీసీలను నియమించాలన్నారు.

ప్రజారోగ్యంపై దృష్టి సారించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

పెగడపల్లి: సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని మండల ప్రత్యేక అధికారి వేణు గోపాల్‌రావు సూచించారు. మండలంలోని ఆరవెల్లిలో శుక్రవారం జరిగిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన ఎంపీవో మహేందర్‌తో కలిసి పాల్గొన్నారు. మురికి కాల్వల నిర్వహణ, పరిశుభ్రతను పరిశీలించి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లతో ఆయన మాట్లాడుతూ సమన్వయంతో పనిచేస్తూ వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్య, శంకరమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జగిత్యాల: బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన రూ.21,292 కోట్లు సరిపోవని, 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల అభివృద్ధి రూ.500 కోట్లతో ఎలా సాధ్యమవుతుందని, ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తుందన్నారు. విద్యార్థులకు మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌలిక వసతులు కల్పిస్తామని హామీలు ఇచ్చి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. గురుకులాలకు సొంత భవనాలు కేటాయించలేదని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ కుమార్, సంతోష్, పృథ్వీ, ఆకాంక్ష, రమ్య, అనిత, సౌమ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని గోధూర్, యామాపూర్, వేములకుర్తి, ఎర్దండి గ్రామాల్లో శుక్రవారం డ్రై డే సందర్భంగా పారిశుధ్య పనులను ఎంపీవో చంద్రశేఖర్ పరిశీలించారు. వర్షాలు పడుతున్నందునా గ్రామాల్లో చెత్తా చెదారం , మురికి లేకుండా శుభ్రం చేయాలని దోమల భారీన పడకుండ పిచ్‌కారి చేయాలని రొడ్లపై ఉన్న నీటి నిలువ గుంతలలో ఆయిల్ బాల్స్ వేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎర్దండిలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హర్షద్, వినయ్, ఏఈ అరుణ పాల్గొన్నారు.

రోడ్లు పాడవుతున్నా పట్టింపేది?



- కేజీవీల్స్‌తో రహదారుల ధ్వంసం
- ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

మల్లాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాల కోసం ప్రభుత్వం వందల కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం ఉండడం లేదు. పట్టుమని రెండేళ్లు కూడా గడవక ముందే కేజీవీల్స్‌తో రహదారులు నరకదారులుగా మారుతున్నాయి. వందల కోట్లతో నిర్మించిన రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరుగుతుండడంతో రోడ్ల నాణ్యత మున్నాళ్ల ముచ్చటగానే మిగులుతోంది. ఫలితంగా ఆ రోడ్లపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వానాకాలం, యాసంగిలో పంట సాగు చేసేటప్పుడు గ్రామాల్లో కేజీవీల్స్ ట్రాక్టర్లను రోడ్లపై నడుపుతుండడంతో రహదారులు పాడవుతున్నాయి.

మల్లాపూర్ మండలంలో...

మండలంలోని పలు మార్గాల్లో నిర్మల్–జగిత్యాల 61వ నంబర్ జాతీయ రహదారితో పాటు డబుల్‌రోడ్లు, లింక్ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం సుమారు వందలాది కోట్ల నిధులు మంజూరు చేసింద. కొన్ని మార్గాల్లో పనులు పూర్తవగా, మరికొన్ని మార్గాల్లో డబుల్‌రోడ్డు, లింక్‌రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ రహదారులపైనే కేజీవీల్స్ ట్రాక్టర్లు విచ్చలవిడిగా తిరుగుతుండడంతో రోడ్ల మధ్య పగుళ్లు ఏర్పడి దెబ్బతిన్నాయి. కొన్ని మార్గాల్లో రోడ్లు ధ్వంసమై కంకర తేలి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో తిరగాల్సిన కేజీవీల్స్ ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో గీతలు పడి

కనిపించని చర్యలు..

కేజీవీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్డెక్కితే...నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీస్ అధికారులు సదరు ట్రాక్టర్ యజమానులపై చర్యలు తీసుకోవాలి. కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకున్నట్లు ఎక్కడ కనిపించలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యాన్ని అవకాశంగా తీసుకుంటున్న ట్రాక్టర్ల యజయానులు యథేచ్ఛగా కేజీవీల్స్‌తో రోడ్లనే దున్నేస్తున్నారు.



ద్విచక్రవాహనదారులు తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. 15 ఏళ్ల ల పాటు మన్నిక ఉండాల్సిన రహదారులు కేవలం ఒకటి, రెండేళ్లకే ధ్వంసమై గుంతలు, పగుళ్లు, గీతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇంత జరుగుతున్న ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

రోడ్లపై కేజీవీల్స్ నడుపొద్దు



రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపితే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటాం. కేజీవీల్స్‌కు పట్టీలు వేసుకుని ఉపయోగించుకోవాలి. కేజీవీల్స్ ట్రాక్టర్లను రోడ్లపైకి నడపొద్దని గ్రామాల్లో ప్రచారం చేయిస్తా. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– కిరణ్‌కుమార్, ఎస్సై, మల్లాపూర్

చర్యలు తీసుకుంటాం



కేజీవీల్స్‌తో ట్రాక్టర్లను తారురోడ్లపై నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బీటీ రోడ్లపై కేజీవీల్స్ ట్రాక్టర్‌తో నడుపుతూ కనిపిస్తే ట్రాక్టర్‌ను సీజ్ చేయడంతో పాటు జరిమానా విధిస్తాం. రహదారి భద్రతకు అందరూ సహకరించాలి.

– వీర్‌సింగ్, తహశీల్దార్, మల్లాపూర్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం పలు కాలనీలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ అనేకంగా వస్తుంటాయని, ఖాళీ స్థలాల్లో నీటిని నిలువ ఉంచకూడదని, కొబ్బరిబొండాలు, ప్లాస్టిక్ వంటి వస్తువులు ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూసుకోవాలన్నారు.ఆమె వెంట కమిషనర్ సమ్మయ్య ఉన్నారు.



డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

వ్యవసాయ రంగానికి పెద్దపీట

జగిత్యాల: గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి రూ.72,650 కోట్లు కేటాయించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయం ఇవ్వడం జరుగుతుందని, మహిళ సొసైటీ సభ్యులకు రూ.10 లక్షల ప్రమాదబీమా, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చొరవతో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ, విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, పేదల ఆత్మ గౌరవం కోసం సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో కేటాయించారన్నారు.

వృక్షానికి జీవం పోయండి



కూలిపోయిన భారీ వృక్షం

జగిత్యాల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ రోడ్డులో రాజారం వద్ద భారీ వృక్షం నేలకూలింది. కాగా, రాజన్న సిరిసిల్లకు చెందిన ప్రకృతి ప్రకాశ్ సమాచారం తెలుసుకుని ఆ వృక్షాన్ని రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ వృక్షాన్ని ఒక చోట నుంచి మరో చోటకు తీసుకెళ్లేందుకు చాలా ఖర్చవుతుందని, కలెక్టర్ స్పందించి వృక్షానికి మళ్లీ జీవం పోయవచ్చన్నారు. వివరాలకు ఈ నంబర్ 8985101214లో సంప్రదించాలని కోరారు. ప్రకాశ్ ఇంతకుపూర్వం సైతం వృక్షాలను ఇతర చోట్లకు తరలించి జీవం పోశాడు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన

మేడిపల్లి: అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి ఆదేశాలతో సీజనల్ వ్యాధుల పట్ల పంచాయతీ కార్యదర్శులు, ఆశలు గ్రామాల్లో ఇంటింటా అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. భీమారం, కట్లకుంట గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు కాగా, అధికారులు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిలవ్వలు ఉండకుండా చూడాలన్నారు. వారం రోజుల నుంచి ఎడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షాలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు.



నిల్వ నీటిని పారబోస్తున్న అధికారులు

ఉద్యమకారులకు గుర్తింపేది?



మాట్లాడుతున్న ఉద్యమకారులు

జగిత్యాల: రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యమకారుల ఊసేలేదని ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ అన్నారు. కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించడం జరిగిందని, కానీ తెలంగాణ కోసం పోరాటం చేస్తే కనీసం గుర్తింపు లేదని, సీఎం స్పందించి ఉద్యమకారులను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాజు, గంగారెడ్డి, సురేశ్, గంగస్వామి, గంగాధర్, జగన్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్: పరిశుభ్రతపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పరిశుభ్రతపై దృష్టి సారించాలని, మురికికాలువలను శుభ్రం చేయడంతో పాటు, ప్రధాన వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించి ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని మౌలిలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంపీవో సలీం తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

బీర్‌పూర్ తహసీల్దార్‌గా శ్రీనివాస్

సారంగాపూర్: బీర్‌పూర్ తహసీల్దార్‌గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి తహసీల్దార్ నరేశ్ రాజన్న సిరిసిల్లా జిల్లాకు బదిలీ కాగా, ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా నుండి శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డెప్యూటి తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



బోనమెత్తుకున్న జువ్వాడి నర్సింగరావు



వివిధ వేషధారణలతో ఆకట్టుకున్న విద్యార్థులు

ఘనంగా బోనాలు

కోరుట్ల: పట్టణంలోని శివ మార్కండేయ, కోటి నవదుర్గ ఆలయం ఆధ్వర్యంలో ఆషాడ మాస బోనాల పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, కౌన్సిలర్లు, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి(బుగ్గారం): మండల కేంద్రంలోని కల్యాణి అకడమిక్ హైట్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం తెలంగాణ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిలో భాగంగా బోనాల వేడుకలను నిర్వహించినట్లు కరస్పాండెంట్ అబ్దుల్ రహమాన్, ప్రిన్సిపాల్ బిసగోని రవి తెలిపారు.

రామాలయంలో పూజలు

మెట్‌పల్లిరూరల్: పారిస్‌లో జరిగే 33వ ఒలంపిక్స్ పోటీల్లో భారతదేశ క్రీడాకారులు విజయం సాధించాలని మార్గదర్శి కాన్వెంట్ స్కూల్ విద్యార్థులు వేంపేట రామాలయంలో పూజలు నిర్వహించారు. భారతదేశానికి చెందిన 117 మంది అథ్లెటిక్స్ క్రీడాకారులు పథకాలు గెలుపొందాలని వేడుకున్నారు.కార్యక్రమంలో కరస్పాండెంట్ ఏలేటి లక్ష్మీ,విద్యార్థులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న విద్యార్థులు

ఆలయంలో త్రిమూర్తులకు అభిషేకం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్ర లింగాల ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిమూర్తులకు అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

చేప పిల్లల పంపిణీకి సిద్ధం

జగిత్యాలరూరల్: మత్స్యకారుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం ఏటా వారికి ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోంది. ప్రతి ఏడాది జిల్లాలో ఉన్న చెరువులు, కుంటల విస్తీర్ణాన్ని బట్టి వాటిల్లో జిల్లా మత్స్యశాఖ అధికారులు ఉచితంగా చేపపిల్లలు పోస్తున్నారు. వానాకాలం సీజన్లో జిల్లాలోని 733 చెరువులు, కుంటలకు, మరో 1 రిజర్వాయర్‌కు కలిపి మొత్తం 166.70 కోట్ల చేప పిల్లలు అవసరం అవుతాయని జిల్లా మత్స్య శాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం చేపపిల్లల సరఫరా కోసం టెండర్లు పిలిచింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలకు సరిపడా చేపపిల్లలను ప్రభుత్వం వంద శాతం సబ్సిడీతో మత్స్యకారులకు సరఫరా చేయనుంది. ఉచితంగా పంపిణీ చేసే చేపపిల్లల పెంపకంతో మత్స్యకారులకు ఏడాది అంతా ఉపాధి లభిస్తోంది.జిల్లాకు అవసరమైన ఉచిత చేపపిల్లల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని మత్స్యశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి శివప్రసాద్ తెలిపారు.



చేపపిల్లలు

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్





జగిత్యాల ఎంపీడీవో కార్యాలయంలో, రాయికల్‌లో నివాళి అర్పిస్తున్న అధికారులు, నాయకులు

జగిత్యాల: కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని జ్యోతి పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సైనికుల గొప్పతనాన్ని వివరించి దేశభక్తిని వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు హరిచరణ్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరి క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, టీవీ సూర్యం, ముత్తు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం కార్గిల్ 25వ విజయ్ దివస్ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులకు మౌనం పాటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికల్: కార్గిల్ దివస్ సందర్భంగా శుక్రవారం బీజేపీ, రాయికల్ లయన్స్‌క్లబ్ , యువజన సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సై, మున్సిపల్ చైర్మన్ మోరహన్మాండ్లు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి పాల్గొన్నారు.

ప్రగతి ఉన్నత పాఠశాలలో శుక్రవారం కార్గిల్‌విజయ్ దివస్ సందర్భంగా విద్యార్థులు అమరువీరులైన సైనికులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బాలె శేఖర్, డైరెక్టర్ నిఖిల్ పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులపై బీజేపీ నాయకుల నిరసన

ధర్మపురి: బడ్జెట్‌లో దళితులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని శుక్రవారం ధర్మపురిలో జాతీయ రహదారిపై బీజేపీ ఎస్సీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొనకొండ నరేశ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. దళిత వర్గాలకు సంబంధించిన బిల్లులో 350 కోట్లు తగ్గించారని సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గానికి 4369 కోట్ల రూ.లు కేటాయించుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, కో కన్వీనర్ బందారు లక్ష్మణ్, నాయకులు చంద్రశేఖర్ బెజ్జారపు లవన్‌కుమార్, పిల్లి శ్రీనివాస్, గంగారాం, గాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్: గ్రామాల్లో దొంగతనాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కథలాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ శుక్రవారం కోరారు. ప్రక్క మండలాల్లో తాళం వేసిన ఇళ్లలోనే ఎక్కువగా దొంగతనాలు జరిగిన సంఘటనలున్నాయన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లేవారు, ఇతర గ్రామాలకు వెళ్లేవారు బంగారు ఆభరణాలు ఇళ్లలో ఉంచుకోవద్దన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్సై పేర్కొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

రాయికల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిలర్లు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఘనంగా రిజర్వేషన్ డే

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ గ్రామంలో శుక్రవారం రిజర్వేషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి సాహు మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశ చరిత్రలో తొలిసారిగా 1902లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కొల్హాపూర్ సంస్థానంలో విద్య, ఉద్యోగ రంగంలో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రోజని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఏవైఎస్ అధ్యక్షుడు అజయ్, ఉపాధ్యక్షుడు రాహుల్, బహుజన నాయకులు గుజ్జరి ప్రకాశ్, పోనకంటి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

కోతుల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

ధర్మపురి: పట్టణానికి చెందిన ఓ మహిళ ఇంటి ముందు పనులు చేస్తుండగా కోతులు దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. ధర్మపురిలోని సంగి వాడకు చెందిన మామిడిపెల్లి శారద శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు పనులు చేసుకుంటుండగా గుంపులుగా వచ్చిన కోతులు మీదపడి తీవ్రంగా గాయపర్చాయి. రక్త స్రావం అవుతున్న మహిళను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుండి జగిత్యాల ఆస్పత్రికి తీసుకెల్తున్నట్లు తెలిపారు. ధర్మపురిలో కోతుల బెడద రోజు రోజుకు పెరిగిపోతుందని, కోతుల బెడద నుండి అధికారులు కాపాడాలని కోరుచున్నారు.

శతాధిక వృద్ధుడు మృతి

మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు వేముల బాలయ్య(102) శుక్రవారం మృతిచెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న బాలయ్య శుక్రవారం ఇంటి వద్ద మృతి చెందాడు. మృతుడికి ఐదుగురు కుమారులు కాగా, నలుగురు మృతి చెందగా, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు, 13మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు.

కేడీసీసీబీ డైరెక్టర్‌గా సాగర్

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన మందాడి సాగర్ శుక్రవారం ఉమ్మడి జిల్లా కెడిసిసి బ్యాంక్ (కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్) డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. జిల్లా సహకార బ్యాంక్‌లో జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షుడు కొండూరి రవీందర్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మందాటి సాగర్‌ను డైరెక్టర్‌గా నియమించారు.

చెరువుకు గండి కొట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

ధర్మపురి: మండలంలోని దోనూర్‌లోని ఎల్లం చెరువు కింద వందల ఎకరాల సాగుభూములున్నాయి. చెరువు మత్తడి పక్కన ఒక నాయకుడి పొలం ఉండడంతో వర్షాకాలంలో మత్తడి దూకడంతో ఆ వ్యక్తికి కొంత నష్టం వాటిల్లితుందని భావించి అసలు చెరువుకే గండి కొడితే చెరువులో ఉన్న నీరంతా పోతుందని భావించాడు. గురువారం రాత్రి ఏకంగా జేసీబీ సాయంతో చెరువుకు గండి కొట్టగా చెరువులో ఉన్న నీరంతా వృథాగా పోయింది. దీంతో తమ జీవనోపాధి పోయిందని గ్రామానికి చెందిన గంగపుత్రులు, చెరువు ఆయకట్టు రైతులంతా కలిసి శుక్రవారం పోలీస్ స్టేషన్లో, తహసీల్దార్ కార్యాలయంలో, ఎస్సారెస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు.